క్లుప్తంగా

జనం గుండె చప్పుడు డాక్టర్ వైఎస్సార్

వై.ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజానురంజకంగా పరిపాలించిన ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చరిత్రలో నిలిచారని వైఎస్సార్ సీపీ స్టేట్ ఇంటిలెక్చ్యువల్ ఫోరం అధ్యక్షుడు వై.ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి అన్నారు. గుంటూరులోని అవర్ స్టేట్ అవర్ లీడర్ ఇండియన్ ఇంటలెక్చ్యువల్ ఫోరం అధ్యక్షుడు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతి వారోత్సవాల్లో భాగంగా గొప్ప జ్ఞాపకాలు శీర్షికన 'మానవతా విలువలు కలిగిన' అనే అంశంపై ఆదివారం వెబినార్ నిర్వహించారు. ప్రముఖ కవి, రచయిత కాపిరెడ్డి కృష్ణారెడ్డి మోడరేటర్‌గా వ్యవహరించారు. ఈశ్వర ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ నిజజీవిత సమస్యలకు దగ్గరగా ప్రజలతో పాటు నడిచిన నాయకుడిగా ప్రజలపై ప్రేమ, వారి హృదయాలను అర్థం చేసుకునే మనసు ఉండాలన్నారు. ప్రజల గుండె చప్పుడుకు అణుగుణంగా తన సుపరిపాలన జరిగిందని అన్నారు.

సాయినాథునికి విశేష అభిషేకాలు



నగరంపాలెం: స్థానిక విద్యానగర్ మూడో వీధిలోని శ్రీసాయినాథ సన్నిధానంలో గురుపూర్ణిమ వేడుకలు ఆదివారానికి మూడో రోజుకి చేరాయి. తొలి ఏకాదశి సందర్భంగా సాయినాథునికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం శ్రీసాయి సత్యవ్రతాలు శాస్త్రబద్ధంగా నిర్వహించారు. సాయినామ సప్తాహం మూడో రోజు కొనసాగగా, భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు యడ్లపాటి అశోక్‌కుమార్, అధ్యక్షులు వడ్లమూడి శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



నగరంపాలెం: తొలి ఏకాదశి సందర్భంగా బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై ఆదివారం రాత్రి కూచిపూడి నృత్యప్రదర్శనలు నిర్వహించారు. గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆలయ పాలక మండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం భాగవతుల వెంకటరామశర్మ సౌమ్య దంపతుల శిష్య బృందం(శ్రీ నృత్య ఆర్ట్ అకాడమీ విజయవాడ) ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో నిఘంటు నిర్మాత పెద్ది సాంబశివరావు, సేవ సంస్థ వ్యవస్థాపకులు గుళ్లపల్లి సుబ్బారావు, గుళ్లపల్లి రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూ నగర్: డయల్ యువర్ కమిషనర్(0863–2224202) కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కమిషనర్ చాంబర్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని ఆ ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు వృత్తికి పునరంకితమై, తల్లిదండ్రుల అభీష్టం మేరకు పని చేసి ప్రభుత్వ పాఠశాలలను పరిక్షించుకోవాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు అన్నారు. ఆదివారం ఏపీటీఎఫ్ గుంటూరు మండల శాఖ ఆధ్వర్యంలో అంకిరెడ్డిపాలెం ఎంపీపీ స్కూల్ ఎస్జీటీ రుక్మిణి, అడవితక్కెళ్లపాడు ఎంపీపీ స్కూల్ ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం కరుణకుమారి ఉద్యోగ విరమణ అభినందన సభను బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య హైస్కూల్ ఆడిటోరియంలో ఏపీటీఎఫ్ గుంటూరు జోన్ కన్వీనర్ పి.నాగశివన్నారాయణ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా కమిటీ సభ్యులు మూర్తి, దాస్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

లక్ష్మీపురం: పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్ ఉన్న వారు, ప్రతి ఒక్కరూ ప్రతి ఆదివారం స్టేషన్‌లో హాజరు కావల్సిందిగా ఆదేశించారు.

ఆ వార్డు సచివాలయాల్లో నో బదిలీలు

- బిల్ కలెక్టర్లు పనిచేస్తున్న వారు ఆప్షన్ ఇచ్చినా కేటాయించని అధికారులు
- 26 సచివాలయాలకు బదిలీల ప్రక్రియ నుంచి మినహాయింపు
- శనివారం రాత్రి బదిలీల ఉత్తర్వులు జారీ
- రూరల్ పరిధిలో ఓ కార్పొరేటర్ హవా



బిల్ కలెక్టర్లు పనిచేస్తున్న సచివాలయ వివరాలకు సంబంధించిన జాబితా

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో పూర్తిగా నిబంధలు ఉల్లంఘించారు. తమ అనుకునే వారికి అధికారులు పోస్టింగ్‌లు ఇచ్చారని ఆరోపణలున్నాయి. గత నెల 28, 29వ తేదిల్లో సచివాలయా ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన కౌన్సిలింగ్ ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియలో కేవలం మూడు ఆప్షన్లు ఇచ్చి వెళ్లాలని అధికారులు కోరారు. కానీ బదిలీల ఉత్తర్వులు చూస్తే సిఫార్సు లేఖలు, ముడుపులకే ప్రాధాన్యం అని గగ్గోలు పెడుతున్నారు.

ముడుపులే కీలకం...

వార్డు అడ్మిన్ సెక్రటరీలు, వార్డు శానిటేషన్ సెక్రటరీలకు, వార్డు వెల్ఫేర్ సెక్రటరీలకు సంబంధించి బదిలీల ప్రక్రియ అంతా కూడా నగరపాలక సంస్థ ఉద్యోగులే చేశారనే చెప్పుకోవాలి. ఎమ్మెల్యే సిఫార్సుల లేఖలన్నింటిని పరిశీలించిన తరువాత వాటిని ఫైనల్ చేసిన తరువాత ఎవరైన సిఫార్సు లేఖలు తెచ్చుకోకుండా తమకు నచ్చిన సచివాలయం కావాలంటే నగరపాలక సంస్థ పనిచేస్తే ఉద్యోగులకు ముడుపులు సమర్పించుకుంటే మీకు కావాల్సిన సచివాలయం కేటాయిస్తామని చెప్పడంతో కొంత మంది సచివాలయ ఉద్యోగులు ముడుపులు ఇచ్చి సచివాలయాలు కేటాయింపజేసుకున్నారు. ముఖ్యంగా అడ్మిన్ సెక్రటరీలకు సంబంధించి రెవెన్యూ సెక్షన్‌లో ఓ గుమస్తా, శానిటేషన్ సెక్రటరీలకు సంబంధించి ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి, వెల్ఫేర్ సెక్రటరీలకు సంబంధించి ఉపా సెల్‌లో ఓ ఉద్యోగి బదిలీల ప్రక్రియలో ముడుపులు తీసుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మంది ముడుపులు సమర్పించుకున్నప్పటికి వారు అనుకున్న సచివాలయం రాకపోవడంతో సంబంధింత సెక్షన్స్‌కు వెళ్లి సచివాలయ ఉద్యోగులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

రూరల్ పరిధిలో ఒక కౌన్సిలర్ మంత్రగం

రూరల్ పరిధిలో ఒక వార్డు పరిధిలోని సచివాలయాల్లో అంతా ఒకే సామాజిక వర్గానికి మాత్రమే పోస్టింగ్ ఇచ్చి.. మిగిలిన సామాజిక వర్గాలకు వారికి మొండి చూపారని కొంత మంది ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఒక సచివాలయంలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులు తిరిగి పక్కనే ఉన్న మరో సచివాలయంలో ముగ్గురికి పోస్టింగ్ ఇవ్వడం చూసి అవాక్కయ్యారు. అదే విధంగా స్పౌజ్ కేటగిరి నిబంధనలను పాటించాలని స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నా ఆ నిబంధనలను తుంగలో తొక్కి మరి తమ అనుకునే వారికి పోస్టింగ్ ఇవ్వడంపై సచివాలయ ఉద్యోగులు మండిపడుతున్నారు.

వార్డు సచివాలయాలకు సర్దుబాటు ఇలా..

5వ తేదీన వార్డు సచివాలయ ఉద్యోగులకు కేటాయించిన సచివాలయాల్లో 26 వార్డు సచివాలయాలు మినహా మిగిలిన వాటిల్లో సచివాలయ ఉద్యోగులను సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు నగపాలక సంస్థ పరిధిలో 26 మంది బిల్ కలెక్టర్లు 2019లో ఏర్పాటైన వార్డు సచివాలయాల్లో బిల్ కలెక్టర్లుగా గత 5 ఏళ్ల పైబడి పనిచేస్తున్నారు. అయితే సదరు బిల్ కలెక్టర్లతో ముందుగానే నగరపాలక సంస్థ అధికారులు ఒక ఒప్పందం కుదుర్చుకుని మీరు చేస్తున్న సచివాలయాల్లో కొనసాగే విధంగా చూస్తామని చెప్పినట్లు ఆరోపణలు రావడంతో పాటు పత్రికల్లో వార్త కథనాలు రావడంతో పాటు కొంత మంది వార్డు సచివాలయ ఉద్యోగులు కూడా ఈ అన్ని సచివాలయాల్లో బదిలీలు నిర్వహించాలని అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో చేసేదేమి లేక బిల్ కలెక్టర్లు పనిచేస్తున్న సచివాలయాలకు కూడా ఆప్షన్ ఇవ్వాలని సూచించడంతో చాలా మంది బిల్ కలెక్టర్లు పనిచేస్తున్న సచివాలయాలకు కూడా ఆప్షన్స్ ఇచ్చారు. కాని 5వ తేదీన ఇచ్చిన ఉత్తర్వుల్లో బిల్ కలెక్టర్లు పని చేసే 26 సచివాలయాల్లో ఏ ఒక్క దానిని కూడా బదిలీల ప్రక్రియ నిర్వహించలేదని తెలుసుకున్న సచివాలయ ఉద్యోగులు అధికారులు తీరుపై మండిపడుతున్నారు.

పౌర నిఘాతోనే నగర సమస్యల పరిష్కారం

నెహ్రూనగర్: నగరం ఎదుర్కొంటున్న తాగునీటి, పారిశుద్ధ్య సమస్యలకు పరిష్కారం పౌర నిఘాతోనే సాధ్యమని ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ సభ్యుల సమావేశం సామాజిక విశ్లేషకులు టి.ధనుంజయ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఓరుగంటి నారాయణరెడ్డి మాట్లాడుతూ దివంగత ఎస్.వి.ఎల్.నరసింహారావు ప్రథమ గుంటూరు నగర లోక్‌సభ సభ్యుని నేతృత్వంలో ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ 1955లో ప్రారంభమైందని తెలిపారు. మూడు ఏళ్లుగా గుంటూరు నగరంలోని 62 మంచినీటి ట్యాంకులను నిశితంగా పరిశీలించి ట్యాంకులలో పేరుకుపోయిన మురికిని తొలగించడంలో రేట్ పేయర్స్ అసోసియేషన్ విశిష్ట కృషి చేసిందన్నారు. దాదాపు 30కి పైగా నీళ్ల ట్యాంకులలో పేరుకుపోయిన టన్నుల కొద్దీ మురికిని అధికార బృందం సహకారంతో తొలగించడం గర్వకారణమన్నారు. గుంటూరు నగరంలో 1975 మంది పారిశుద్ధ్య కార్మికులు, 57 ట్రాక్టర్లు ఉన్నప్పటికీ పారిశుద్ధ్య సమస్య పరిష్కారం కావడం లేదని వివరించారు. 2 లక్షల 80 వేల నివాస గృహాలకు మంచినీటి సరఫరా నగరపాలక సంస్థ చేస్తుందని, 62 వాటర్ ట్యాంకులను నిరంతరం పరిశుభ్రంగా ఉంచితేనే స్వచ్ఛమైన నీటిని అందించగలమన్నారు. 200కు పైగా ఉన్న సచివాలయాలను గుంటూరు నగర అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలన్నారు. సామాజిక విశ్లేషకులు టి. ధనుంజయ రెడ్డి ప్రసంగిస్తూ గుంటూరు నగరంలోని పౌర సంస్థలు రేట్ పేయర్స్ అసోసియేషన్‌లో భాగస్వాములుగా మారి నాణ్యమైన పౌర సేవలను సాధించుకునేందుకు కృషి జరగాలన్నారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ పావులూరు రమేష్, రేట్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.అంజిరెడ్డి, సంయుక్త కార్యదర్శి వి.సదాశివరావు, శ్యామల నగర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ నేత కనపర్తి రాఘవరావు, విశ్రాంత ఫార్మసిస్ట్ అన్నపూర్ణమ్మ, విశ్రాంత అధ్యాపకులు సూరం నారాయణరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నారాయణ తీర్థుల తరంగ గానార్చన



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ స్వామి మందిరం ఆవరణలోని త్యాగరాజస్వామి కళావేదికపై శ్రీనారాయణ తీర్థుల జయంతి మహోత్సవాలు ఆదివారం నిర్వహించారు. గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భారతీయ విద్యాభవన్ గౌరవ కార్యదర్శి పి.రామచంద్రరాజు, శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘ కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. శ్రీనారాయణ తీర్థుల తరంగాలను ఏంవై శేషరాణి, పి.లలితాదేవి, డాక్టర్ కె.మృణాళిని, ఎం.మాధవీకృష్ణ, జి.శ్రీవల్లి గానం చేశారు. వయొలిన్‌పై చావలి శ్రీనివాస్ (విజయవాడ), మృదంగంపై కామరాజుకిషోర్ వాయిద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో సన్మండలి అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, ప్రధాన కార్యదర్శి ఏంవై శేషరాణి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటి బండ్ల లలితాదేవి, కార్యదర్శి ఏవీ మంగాదేవి, కోశాధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి



గుంటూరు మెడికల్: బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ధారా అంబేడ్కర్ ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షురాలు కృపామణి, కత్తి మేరీ సరోజిని, భూసి స్టాలిన్ బాబు, మండల అధ్యక్షుడు మలిశెట్టి పవన్, మల్లాల లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి తోట శ్రీనివాసరావు, సురేష్ జైన్, సముద్రాల కోటేశ్వరరావు, సుబ్బయ్య పాల్గొన్నారు.

కీళ్ల వ్యాధులకు అధునాతన చికిత్స

లక్ష్మీపురం: మనిషికి ముఖ్యమైన అవయవాలలో వెన్నెముక ఒకటి అని అలాంటి వెన్నెముకకు సమస్య ఏర్పడితే మనిషి సాధారణ జీవితం దుర్భరంగా మారుతుందని సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ యలవర్తి రాకేష్ కిరణ్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా వెన్నెముకకు సంబంధించి తరచుగా కనపడే సమస్యలలో స్పాండిలైటిస్ అని, మెడ భాగంలోని డిస్కులు అరిగిన లేదా వాటికి స్థాన చలనం జరిగిన ఈ సమస్య ఉత్పన్నమవుతుందని వివరించారు. అనంతరం డాక్టర్ యలవర్తి రాకేష్ కిరణ్‌ని ఘనంగా సత్కరించారు. సాయిరాం, వి.వి.రావు, టి.సుబ్బారావు, ఏవీ రామారావు పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో పేదలకు పెన్షన్ పంపిణీ



వృద్ధులకు పెన్షన్ అందజేస్తున్న సురేష్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) కార్యాలయంలో ఆదివారం 108 మంది పేదలకు నెలవారీ పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు కోటా సురేష్ కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులకు వచ్చే వివిధ రకాల మానసిక సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఎక్కువ సమయం గడపడంతో పాటు యోగా, నడక ద్వారా వివిధ రకాల సమస్యలను నివారించవచ్చునని తెలిపారు. చార్టర్డ్ అకౌంటెంట్ తూనుగుంట్ల అప్పారావు మాట్లాడుతూ 108 మంది పేదలు, వృద్ధులకు ప్రతి నెలా రూ.500 చొప్పున పెన్షన్, రూ.వెయ్యి విలువల నిత్యావసరాలు ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా టెన్త్ ఫలితాల్లో 598 మార్కులు సాధించిన విద్యార్థిని హాసినిని సత్కరించి, రూ.ఐదు వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో అవోపా కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, పెన్షన్ కన్వీనర్ వెంకట్రావు, మోహన్, కాళంగి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'గాజా కోసం మౌనం' కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి, నాయకుడు రవి

లక్ష్మీపురం: గాజా కోసం మౌనం పేరిట ప్రపంచవ్యాప్తంగా ఇచ్చిన నిరసన కార్యక్రమంలో మన దేశంలోని ప్రజానీకం కూడా పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.రవి తెలిపారు. బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వై.నేతాజీ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గాజకోసం మౌనం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రజానీకం ప్రతి రోజు రాత్రి 9గంటల నుంచి 9.30 గంటల వరకు ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి సంఘీభావం తెలపాలని కోరారు. అంతర్జాతీయ సాంకేతిక సంస్థలుగా ఉన్న వారు ఈ దాడికి సహకరిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ సమాజం ఈ రకమైన టెక్నికల్ బంద్‌కి పిలుపు నివ్వడం జరిగిందన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

లక్ష్మీపురం: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుంటూరు పాత గుంటూరులోని జిల్లా కార్యాలయంలో ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా 11వ మహాసభ బి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచకంగా సంఘం జెండాను సంఘం సీనియర్ నాయకులు ఆది నికల్ సన్ ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా నార్నె నాగేశ్వరరావు, దండా లక్ష్మీనారాయణ, కోశాధికారిగా ఎస్ కే బాషాష, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఖాసిం వలి, బాబూరావు, సహాయ కార్యదర్శులుగా దీవెనరావు, శ్రీనివాసరావు, మస్తానవలి నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు ఈనెల 23, 24 తేదీల్లో గుంటూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



మందులు అందజేస్తున్న దేగల ప్రభాకర్

గుంటూరు మెడికల్: పేద ప్రజల ఆరోగ్యం కోసం ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. ఆదివారం గోరంట్ల రామాలయం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 430 మంది ప్రజలు వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి,మందులను ఉచితంగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ దేగల ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ గోరంట్ల వాస్తవ్యులైన డాక్టర్ తేజస్వి జల్లేపల్లి పేదలకు సేవ చేయాలనే గొప్ప ఉద్దేశంతో ఈ క్యాంప్ నిర్వహించారని తెలిపారు. డాక్టర్ తేజస్వి మాట్లాడుతూ వైద్య శిబిరంలో గుండె సంబంధిత ఈసీజీ, 2డీ ఎకో వంటి టెస్టులు ఉచితంగా చేస్తున్నామన్నారు. బ్లడ్ టెస్టులు కూడా ఉచితంగా చేస్తున్నామన్నారు. కార్పొరేటర్ ఎర్రంశెట్టి పద్మావతి, నూకవరపు బాలాజీ, ఎర్రంశెట్టి వేణు,రాజేష్ ,కాసుల సాయి రాజశేఖర్, చెరుకూరి జగదీష్ పాల్గొన్నారు.

విద్య ద్వారానే విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి సాధ్యం



గుంటూరు ఎడ్యుకేషన్: విద్య ద్వారానే విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి సాధ్యమని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, రావూరి భరద్వాజ అవార్డు గ్రహీత నూతలపాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శ్రీ విశ్వకర్మ పేద విద్యార్థి సంక్షేమ సంఘం 28వ వార్షికోత్సవాన్ని ఆదివారం అరండల్‌పేటలోని ఆంధ్ర రాష్ట్ర ఏపీఏ విశ్వబ్రాహ్మణ సమాజ ప్రాంగణంలో నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన సంఘ వ్యవస్థాపకుడు గోనుగుంట శేషగిరిరావు మాట్లాడుతూ గత 28 ఏళ్లుగా దాతల సహకారంతో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వేదోపాధ్యాయులు ఆలూరి సుబ్రహ్మణ్య శర్మ, ప్రముఖ చిత్రకారులు పాములపాటి శివరామకృష్ణను గౌరవ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు పట్నాల శివప్రసాద్, ఉపాధ్యక్షులు కందేపు వెంకట్రావు, కార్యదర్శి కట్టెవరపు కష్టారావు, కోశాధికారి చిర్రావూరి సుధీర్ బాబు, సిహెచ్ వసంతరావు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు యలమర్తి ధర్మారావు, గన్నే వాసుదేవరావు, పూసపాటి శేషగిరిరావు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్‌కు ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల మెన్స్ హాస్టల్‌లో గత 53 సంవత్సరాలుగా దినసరి వేతనంపై ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న చంద్రారెడ్డికి ఆదివారం వైద్య కళాశాల 1977 బ్యాచ్ పూర్వ వైద్య విద్యార్థులు ఒక లక్షా నలభైవేలు నగదును అందజేశారు. మెన్స్ హాస్టల్‌ను నమ్ముకుని చాలీచాలని జీతంతో జీవనం గడుపుతున్న చంద్రారెడ్డికి కృతజ్ఞతగా సహాయం చేసినట్లు పూర్వ వైద్య విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలుకు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ కేశావ్, విజయవాడకు చెందిన ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కాలే షావలి, నెల్లూరు వైద్య కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళి, చీరాలకు చెందిన డాక్టర్ అమృతపాణి, గుంటూరు జీజీహెచ్ రిటైర్డ్ ఆర్ఎంఓ డాక్టర్ ఎం.ఆదినారాయణ, గుంటూరు జీజీహెచ్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ గడ్డం విజయసారథి, మచిలీపట్నం మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ టి.శివయ్య, గుంటూరు వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, అసిస్టెంట్ వార్డెన్ డాక్టర్ శివగోపాల్ పాల్గొన్నారు.

నేడు కార్మికుల ధర్నాను జయప్రదం చేయండి

లక్ష్మీపురం: కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించనున్న ధర్నా జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నగర ప్రధాన కార్యదర్శి కోట మాల్యాద్రి, యూనియన్ అధ్యక్షుడు వెంకటరావు కోరారు. గుంటూరు నల్లచెరువు శానిటరీ డివిజన్ వద్ద ఆదివారం కార్మికులనుద్దేశించి మాట్లాడారు.

దేవాలయాల్లో తొలి ఏకాదశి పూజలు



శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో వెంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు



మల్లారెడ్డినగర్‌లో అమ్మవారికి శాకాంబరి అలంకారం



మల్లికార్జునపేటలో ప్రత్యేక అలంకరణ



సాయి మందిరంలో సాయిపారాయణం చేస్తున్న భక్తులు

నగరంపాలెం: నగర, శివార్లల్లోని దేవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆదివారం తొలి ఏకాదశి కావ డంతో స్వామి వార్లు, అమ్మవార్లను దర్శించుకునేందుకు వేకువజాము నుంచి భక్తులు బారులు తీరారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో బృందావన శ్రీనివాసుని విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేపట్టారు. వికాస్‌నగర్ షిరిడి సాయిబాబా మందిరంలో తొలి ఏకాదశి, వార్షికోత్సవాల సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయి పారాయణ నిర్వహించి హారతిచ్చారు. స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయం ప్రాంగణంలో శ్రీరామలింగేశ్వర స్వామికి, శ్రీపర్వతవర్ధిని అమ్మవారికి, శ్రీవిద్యాసరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. శాకంబరిగా అలంకరించారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం గుంటూరు వాసవిక్లబ్ ఆధ్వర్యంలో వేదాద్రి శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో వేలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

శాకాంబరీదేవిగా భ్రమరాంబిక..

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామివారి దేవస్థానంలో ఆదివారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని అమ్మవారు శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు.